క్లుప్తంగా

మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు

దహెగాం: ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉమెన్స్ క్లీనిక్ ఏర్పాటు చేసి మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహిస్తామని వైద్యాధికారి స్పందన పేర్కొన్నారు. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు స్త్రీలకు పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అవకాశాన్ని మండల మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'కంటివెలుగు' సద్వినియోగం చేసుకోవాలి

చింతలమానెపల్లి: తెలంగాణ ప్రభుత్వం ప్రజల కోసం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ డుబ్బుల నానయ్య, జెడ్పీటీసీ డుబ్బుల శ్రీదేవి వెంకన్నలు అన్నారు. మండలంలోని బాలాజీ అనుకోడ గ్రామంలో సోమవారం కంటివెలుగు వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. సర్పంచ్ సుజాత, వైద్య శిబిరం అధికారి అజ్మీర రాజ్‌కుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు డుబ్బుల వెంకన్న పాల్గొన్నారు.

కుక్కల నుంచి రక్షణ కల్పించాలని వినతి

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని అనేక ప్రాంతాల్లో పిచ్చి కుక్కల బెడద పెరిగిందని, నివారణ చర్యలు తీసుకోవాలని సోమవారం తెలంగాణ వయోవృద్ధుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ కోరారు. ఆయన ఆధ్వర్యంలో సంఘం నాయకులు స్థానిక మున్సిపల్ కమిషనర్ అంజయ్యకు వినతిపత్రం అందజేశారు.

చట్టాలపై అవగాహన ఉండాలి



అవగాహన కల్పిస్తున్న జడ్జి ఉమా మహేశ్వరి

ఆసిఫాబాద్‌రూరల్: మహిళా చట్టాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జడ్జి ఉమా మహేశ్వరి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో చట్టాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. బాల్య వివాహాలు, మహిళలపై వేధింపులు పెరిగిపోతున్నాయన్నారు. న్యాయవాదులు దీపక్‌రావు, రాజీవ్‌రెడ్డి, నరహరి, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి సమావేశాలకు జిల్లా నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: హైదరాబాద్‌లో నిర్వహించే సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర స్థాయి కార్యకర్తల సమావేశానికి జిల్లా కేంద్రం నుంచి పలువురు కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోజురోజుకూ ధరలు పెంచుతూ సామాన్యులపై ఆర్థిక భారాన్ని మోపుతున్నాయని ఆరోపించారు. విద్యార్థులపై దాడులు జరుగుతున్నా పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. జిల్లాలో భూకబ్జాలు, అక్రమ ఇసుక రవాణా జరుగుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గోగర్ల తిరుపతి, రాజేశ్, అనిల్, మహేశ్, తిరుపతి, బహదూర్ ఉన్నారు.

ఆస్తిపన్ను బకాయిలు చెల్లించాలి

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణ ప్రజలు ఆస్తి పన్ను ఈ నెలాఖరులోగా చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ అంజయ్య ఒక ప్రకటనలో కోరారు. ఆస్తి పన్నులు చెల్లించకుండా పాత బకాయిలు కట్టని వారిని గుర్తించి మంచినీటి నల్లా కనెక్షన్లను తాత్కాలికంగా తొలగిస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే పాత బకాయిలు కట్టని వారికి నోటీసులు జారీ చేయడమే కాకుండా నల్లా కనెక్షన్లను సైతం తొలగించినట్లు తెలిపారు.

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	80
దోసకాయ	40
చామగడ్డ	80
వంకాయ	40
బీరకాయ	40
కాకరకాయ	50
బెండకాయ	100
అలసంద	40
దొండకాయ	60
పచ్చిమిర్చి	50
పాలకూర	60
సోరకాయ	60
చిక్కుడు కాయ	30
గోబి(పూల్)	40
క్యాబేజ	40

-ఆసిఫాబాద్‌అర్బన్

'కొలంగూడ'లో నీటి కష్టాలు

- నిరుపయోగంగా 'మిషన్ భగీరథ'
- అలంకారప్రాయంగా వాటర్‌ట్యాంకు, నల్లాలు
- పట్టించుకోని అధికారులు



నీటి కోసం చేతిపంపు కొడుతున్న ఆదివాసీ మహిళలు



నిరుపయోగంగా నల్లా

తిర్యాణి: వేసవికాలం ప్రారంభమవ్వక ముందే మారుమూల గ్రామాల్లో నీటి కటకట ప్రారంభమైంది. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ మంచినీటిని అందిస్తామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో నీళ్లు అందక ఆదివాసీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంచినీటి సరఫరా కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంకు, నల్లాలు అలంకారప్రాయంగా మారాయి.

గంటల కొద్ది నిరీక్షణ..

మండలంలోని మంగి గ్రామపంచాయతీ పరిధిలోని కొలంగూడ గ్రామంలో 30 కుటుంబాలు ఉండగా 100కుపైగా జనాభా ఉంది. ఈ గ్రామానికి మిషన్ భగీరథ పైప్‌లైన్ ఉన్నా నీరు మాత్రం సరఫరా కావడం లేదు. పైప్‌లైన్ వేసి రెండేళ్లు దాటినా నేటికీ మిషన్ భగీరథ నీరు రావడం లేదు. దీంతో గ్రామంలో ఉన్న రెండు చేతిపంపులపైనే ఆధారపడాల్సిన దుస్థితి నెలకొంది. చేతిపంపుల నుంచి సైతం నీరు రావడానికి గంటల తరబడి శ్రమించాల్సిన పరిస్థితి వారిది. ఉదయం, సాయంత్రం సమయాల్లో ఉన్న రెండు బోర్ల వద్ద మహిళలు క్యూలో తమ వంతు కోసం నిరీక్షిస్తున్నారు. ఇంటింటికీ నీళ్లు రాకపోవడంతో కాలినడకన నెత్తిపై బిందెలు మోస్తూ నీరు తెచ్చుకుంటున్నారు. వేసవి కాలంలో భూగర్భ జలాలు అడుగంటిపోతే నీళ్ల కోసం కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి ఉంటుందని గ్రామస్తులు వాపోతున్నారు. తమ గ్రామానికి మరో బోర్‌వెల్ నిర్మాణం చేపట్టాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి తమ నీటి కష్టాలను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం



మా ఊరికి మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో నీటిని బోర్‌వెల్ నుంచి తెచ్చుకోవడానికి ఇబ్బంది పడుతున్నాం. బిందెడు నీళ్ల కోసం ఎంతోసేపు వేచి చూడాల్సి వస్తుంది. నల్లాలు బిగించారు కానీ నీళ్లు మాత్రం ఇస్తలేరు. మిషన్ భగీరథ నీరు అందేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

- టేకం భీంబాయి, కొలంగూడ

మరో బోర్‌వెల్ వేయాలి



మా గ్రామంలో ఉన్న రెండు బోర్లు సరిపోవడం లేదని మరో బోర్‌వెల్ ఏర్పాటు చేయాలని ఎన్నోసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు చెప్పినం. కాని ఎవరూ పట్టించుకోవడం లేదు. మిషన్ భగీరథ నీళ్లు ఎలాగు ఇవ్వడం లేదు. కనీసం ఇంకో బోర్‌వెల్ అయినా త్వరగా ఏర్పాటు చేయాలి.

- టేకం మౌనిక, కొలంగూడ

అటెన్షన్ ప్లీజ్.. ఏళ్లుగా నిరుపయోగమే..!



తిర్యాణి: మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయానికి వచ్చే ప్రజల కోసం రెండేళ్ల క్రితం రూ.3.75 లక్షలతో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. కానీ ప్లాంట్ నిర్వహణకు సరైనా గది లేని కారణంగా నేటికీ దాన్ని ప్రారంభించ లేదు. దీంతో కార్యాలయానికి వచ్చే ప్రజలతో పాటు కార్యాలయ సిబ్బంది తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు.

సంబంధిత అధికారి: కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ
సెల్ నంబర్: 9652348817

మురుగు తొలగించారు..!

సాక్షి ఎఫెక్ట్..

వాంకిడి: మండలంలోని ఖమాన పంచాయతీ కేంద్రంలో కసర్‌గాం ఎక్స్‌రోడ్డు వద్ద గల తాగునీటి బోరింగుకు అనుసంధానంగా నిర్మించిన ఇంకుడుగుంతలో మురుగు నీరు నిల్వ ఉండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని 'సాక్షి'లో 'ఇంకుడు గుంత మురుగుతో తంటా' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన పంచాయతీ అధికారులు మురుగును తొలగించారు. మళ్లీ మురుగు నీరు నిల్వకుండా బోరింగ్ ప్లాట్‌ఫారమ్‌ను ఎత్తుగా నిర్మించి సమస్య పరిష్కరించారు.



మురుగు నిల్వ ఉండకుండా పనులు చేస్తున్న సిబ్బంది

ఘనంగా కాముని దహనం



కాగజ్‌నగర్‌టౌన్: కాముని దహనంలో పాల్గొన్న భక్తులు

కెరమెరి: జిల్లాలోని గిరిజన గ్రామాల్లో సోమవారం ఘనంగా పులారా (కాముని దహనం) పండుగను జరుపుకున్నారు. కెరమెరి మండల కేంద్రంలోని శివాలయం ఆవరణలో వేడుకలు జరిగాయి. వివిధ కాలనీలకు చెందిన ప్రజలు ప్రతీ ఇంటి నుంచి నైవేద్యం తీసుకొచ్చి సమర్పించారు.

తిర్యాణిలో..

తిర్యాణి: ఆదివాసీ గూడెల్లో సోమవారం ఆదివాసీలు సంస్కృతి, సంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహించి కాముని దహనం చేపట్టారు. అనంతరం గ్రామాల్లోని ప్రజలంతా సంహపక్తి భోజనం చేశారు.

వాంకిడిలో..

వాంకిడి: హోలీ పండుగ పురస్కరించుకుని కాముని దహనం కార్యక్రమాన్ని మండల కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. తయారు చేసిన పిండి వంటకాలతో ప్రత్యేక పూజలు చేసి అందరూ ఒక చోట గుమిగూబి అప్పలు, గారెలను మండలలో అర్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో..

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలో సోమవారం రాత్రి పట్టణ ప్రజలు భక్తిశ్రద్ధలతో కాముని దహనం కార్యక్రమాన్ని నిర్వహించారు. హనుమాన్ మందిర్ చౌరస్తాలో పూజారి నారాయణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కాముని దహనం చేశారు. పేపర్ మిల్లు క్రీడా మైదానంలో మిల్లు యూనిట్ హెడ్ మిశ్రా, జీఎం గిరి, ఉద్యోగులు కామ దహనంలో పాల్గొన్నారు.

పాఠశాలలో హోలీ సంబరాలు

కౌటాల: మండల కేంద్రంలోని వాహిని ప్రైవేట్ పాఠశాలలో సోమవారం విద్యార్థులు హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు రంగులు చల్లుకుంటూ సంబరాలు చేసుకున్నారు. హెచ్ఎం మారుతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిశుమందిర్‌లో..

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో సోమవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు హోలీ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణమాచార్యులు, సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.



కెరమెరి: సాకడలో..



ఆసిఫాబాద్‌రూరల్: శిశుమందిర్‌లో హోలీ వేడుకలు



ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో..

మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

రెబ్బెన: యువత మత్తు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సీఐ అల్లం నరేందర్ అన్నారు. ఎస్పీ సురేష్‌కుమార్ ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని తుంగెడలో పోలీస్ కళాజాత ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సీఐ మాట్లాడుతూ గ్రామాల్లోని యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ సమాజం మెచ్చేలా నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై భూమేష్, పోలీస్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ నరేందర్, ఎస్సై భూమేష్

పూలు తెంపి.. రంగు చేసి!



కెరమెరి: ఆదివాసీలు నేడు జరుపుకునే దురాడి సంబరాలకు సర్వం సిద్ధం చేశారు. సోమవారం వివిధ ప్రాంతాల్లో లభించే మోదుగు పూలను సేకరించారు. అనంతరం నీళ్లలో నానబెట్టి ఎర్రటి రంగు తయారు చేశారు.



రంగును సీసాలో నింపుతున్న చిన్నారులు

పిడకలు పేర్చి.. రొట్టెలు కాల్చి!



పేడ పిడకలపై జొన్న రొట్టెలు కాలుస్తున్న గిరిజనులు

కొలాం తెగ గిరిజనులు హోలీ పండుగకు ముందురోజు ప్రత్యేక సంస్కృతిని ఆచరించడం ఆనవాయితీగా వస్తుంది. పౌర్ణమిరోజు గ్రామ పొలిమేరలో ఎండిన పశువుల పేడ పిడకలను కాల్చి ఆ నిప్పుపై జొన్న రొట్టెలు కాల్చుకుంటారు. రాత్రి పూజలు నిర్వహించి ప్రతీ ఇంటి నుంచి ఒక రొట్టెతో పాటు పప్పు ధాన్యాలు సేకరిస్తారు. మరుసటి రోజు సేకరించిన ధాన్యాలతో వంటలు చేసి ఇంటింటికి పంచి పెడతారు. అనంతరం ఇతర గ్రామాలకు వెళ్లి హోలీ ఆడుతారు. ఈ సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ సోమవారం మండలంలోని సడక్‌గూడ గ్రామంలో గిరిజనులు రొట్టెలు కాల్చారు. - వాంకిడి

'ఆల్ ఇన్ వన్' పుస్తకాల పంపిణీ



కాగజ్‌నగర్‌టౌన్: పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ

కాగజ్‌నగర్‌టౌన్: మజ్లిస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఆర్‌బీస్కూల్, సర్‌సిల్క్, ప్రభుత్వ పాఠశాలతో పాటు ఇతర పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా ఆల్‌ఇన్‌వన్ పుస్తకాలను ఎంఐఎం పార్టీ ఎమ్మెల్సీ మిర్జా రియాజుల్ హసన్ అఫంది చేతుల మీదుగా పంపిణీ చేశారు. 110మంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఎంఐఎం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ ముబీన్, జావిద్ మన్‌లస్, నాయకులు నియాజుద్దీన్, అహ్మద్ పాషా, ఎస్‌కె అజ్గర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలో..

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాల పదో తరగతి విద్యార్థులకు మజ్లిస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు అసదుద్దీన్ ఆదేశాల మేరకు మెటీరియల్ అందజేశారు. పార్టీ నాయకులు అజీమ్ ఉద్దిన్, అలీ, కలాం, అబ్బాస్ తదితరులు ఉన్నారు.

'బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలి'

కాగజ్‌నగర్‌టౌన్: పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆదేశాల మేరకు సోమవారం స్థానిక పద్మశాలి భవన్‌లో సిర్పూర్ తాలుకాస్థాయి బూత్ స్వశక్తికరణ అభియాన్ వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. బీజేపీ తాలుకా నాయకులు పాల్వాయి హరీష్‌బాబు పాల్గొన్నారు.

ఆప్టోమెట్రిస్ట్ సేవలు కొనసాగించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: కంటి వెలుగు కార్యక్రమంలో పని చేస్తున్న ఆప్టోమెట్రిస్ట్ సేవలను కొనసాగించాలని సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణయ్‌యాదవ్ కోరారు. సోమవారం ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు వినతిపత్రం సమర్పించారు. సంఘం సభ్యులు రిచిత, మౌనిక పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

రెబ్బెన: రెబ్బెన పంచాయతీ పరిధిలోని సింగల్‌గూడలో రూ.10 లక్షల ఈజీఎస్ నిధులతో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను సోమవారం జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, సర్పంచ్ అహాల్యాదేవిలు ప్రారంభించారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ 24 గ్రామపంచాయతీల్లో ఈజీఎస్ నిధులతో అంతర్గత రోడ్ల అభివృద్ధికి నిధులు కేటాయించారన్నారు. దాదాపు రూ.2.5 కోట్ల మేర సీసీరోడ్లు మండలానికి మంజూరైనట్లు పేర్కొన్నారు. ఎంపీటీసీ మధునయ్య, ఉప సర్పంచ్ మడ్డి శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్‌కుమార్, కోఆప్షన్ సభ్యుడు జహురోద్దీన్, శ్రీధర్, సుదర్శన్‌గౌడ్, అరుణ పాల్గొన్నారు.

'డయాలసిస్ కేంద్రం ఏర్పాటులో నిర్లక్ష్యం'



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్ ఆరోపించారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో సుమారు 400 మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఉన్నారని, స్థానికంగా డయాలసిస్ కేంద్రం లేక వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్రం ఏర్పాటుకు అవసరమైన పరికరాలు ఉన్నా డీఎంహెచ్ఓ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. జిల్లాలో డయాలసిస్ కేంద్రం ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. నాయకులు శ్యాంరావ్, సతీష్, పవన్, మాలశ్రీ, రాజేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

'లోకానికి మహమ్మద్ ప్రవక్త శాంతి సందేశం'

ఆసిఫాబాద్‌అర్బన్: మహమ్మద్ ప్రవక్త లోకానికి శాంతి సందేశాన్ని ఇచ్చారని, దానిని అమలు చేస్తూ ముందుకు సాగాలని మతపెద్ద ముఫ్తి సాదిక్ ఉల్ ఇస్లాం సూచించారు. ఆదివారం రాత్రి పట్టణంలోని బజార్‌వాడీ చౌరస్తా వద్ద ఇమామ్ ఏ అజమ్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన నాతేయా మోహఫిల్ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం మైనార్టీ నాయకులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు షబ్బీర్, సయ్యద్ నిసార్, అబ్దుల్ రహమాన్, అహ్మద్ బిన్ అబ్దుల్లా, సాజిద్, ఉబెద్ బిన్ యాహియా, ఇఫ్తేకర్, షాకీర్, తాజ్, ఇమ్రాన్, జమీల్, ఖైఫ్, రహమాన్ తదితరులు పాల్గొన్నారు.